క్లుప్తంగా

ఉచిత ఆరోగ్య శిబిరం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో న్యూ మదర్ థెరిస్సా యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు వంశీకృష్ణ, శ్రీలత, యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్, సుమన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



వేల్పూర్: పచ్చలనడ్కుడలో ఆరుగురు బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కర్ గంగాధర్, గట్టవుతల నర్సారెడ్డి, గంగారెడ్డి, మోహన్, అలీముద్దీన్, నెహ్రూ, భోజన్న, చిన్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు



బాల్కొండ: మండల ద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుంది. సోమవారం శిబిరంలో విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని ఎంఈవో రాజేశ్వర్ పర్యవేక్షించారు. విద్యార్థులు శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు.

లైన్‌మన్ మహేందర్‌కు నివాళి



ఎడపల్లి(బోధన్): ఊట్‌పల్లి జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ ఇటీవలే మరణించిన మహేందర్ మృతి పట్ల సోమవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సంతాపం తెలిపారు. మండల కేంద్రంలోని ఆయన నివాసం వద్ద మహేందర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్‌టీపీసీఎల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూదరి గంగాధర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మీరా, నాయకులు గంగాధర్, జనార్దన్, పవన్, గణేష్, లక్ష్మణ్, తదితరులున్నారు

సఫాయి కార్మికుల నిరసన



నందిపేట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా వెల్మల్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు, జిల్లా కార్యదర్శి అబ్దుల్ పిలుపునిచ్చారు. నాయకులు గంగాశంకర్, దేవన్న, భాస్కర్, చింతకుంట ఆశీర్వాదం, అనూరూస్, గంగారం, తెడ్డు నరసయ్య, నల్లెల గంగాధర్, శ్రీనివాస్, పాష పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్‌అర్బన్: ఇంజనీరింగ్ కళాశాల ఫీజుల పెంపును నిరసిస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. ఇప్పటికే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు లేక ఇబ్బందులు పడుతుంటే ఇంజనీరింగ్ ఫీజుల మోతతో ఇంకా ఇబ్బంది పెడుతోందన్నారు. ఫీజుల భారంతో చాలా మంది ఇంజనీరింగ్ విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. టీఏఎఫ్ఆర్సీకి తప్పుడు ఆడిట్ లెక్కలు సమర్పిస్తూ పేద విద్యార్థులను దోచుకుంటున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. డొనేషన్లు వసూలు చేస్తున్న కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా కన్వీనర్ సునీల్, నగర కార్యదర్శి బాలకృష్ణ, యోగేష్, సిద్దు పాల్గొన్నారు.

ప్రారంభానికి కుదరని ముహూర్తం..!

- ముప్కాల్ మండల కేంద్రంలో పల్లె దవాఖానా నిర్మాణం ఏడాది కింద పూర్తి
- ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోని భవనం
- ఇది వరకే రెండు సార్లు వాయిదా



ముప్కాల్ మండల కేంద్రంలోని పల్లె దవాఖానా భవనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మించిన పల్లె దవాఖానా భవనం ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు. మండల కేంద్రంలో పల్లె దవాఖానా భవనం నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2022లో రూ.16 లక్షలు మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ రెండేళ్లకు పూర్తయింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. దీంతో వైద్యసేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతికి ప్రారంభిద్దామని అన్ని ఏర్పాట్లు చేశారు. కాని సంక్రాంతి పండుగకు వద్దు అంటూ వాయిదా వేశారు. ఈ నెల 9న ప్రారంభించటానికి షెడ్యూల్ ఖరారు చేశారు. కాని పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణం ఉందని మళ్లీ వాయిదా వేశారు. నిర్మాణం పూర్తయి బిగించిన లైట్లు పోతున్నాయి కాని భవనం ప్రారంభం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు పక్కన, ఇళ్ల ముందర నిలబడి మందులు సరఫరా చేస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పల్లె దవాఖానా భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సోన్‌పేట్ పరిస్థితి అంతే..

మెండోరా మండలం సోన్‌పేట్‌లో పల్లె దవాఖానా భవనం నిర్మాణం పూర్తయి 8 నెలలు గడుస్తోంది. కాని ఇప్పటికి ప్రారంభం కావడం లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియని వింత పరిస్థితి ఉంది. ఇన్నాళ్లు నిర్మాణాలు పూర్తి కాక ఇబ్బంది.. ఇప్పుడు ప్రారంభం కాక ఇబ్బంది అంటూ ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు.

పది రోజుల్లో ప్రారంభిస్తాం

ముప్కాల్ మండల కేంద్రంలోని పల్లె దవాఖానా భవనాన్ని 10 రోజుల్లో ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 9న జరగాల్సిన ప్రారంభోత్సవం యుద్ధం వల్ల నిలిచి పోయింది. ఉన్నత అధికారులు రీ షెడ్యూల్ చేసే పనిలోనే ఉన్నారు.

– రాకేశ్, వైద్యాధికారి, ముప్కాల్

మందుబాబులకు అడ్డాగా ఖిల్లా

- బాల్కొండ ఖిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు
- ఆవైపు వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు



ఖిల్లా ప్రవేశ ద్వారం వద్ద బీరు సీసాలు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో ఖిల్లా ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. ఖిల్లా ప్రాంతం అంతా పిచ్చి మొక్కలతో భయంకరంగా ఉంటుంది. కాని ఖిల్లా మొదటి ప్రవేశా ద్వారం నుంచి రెండో ప్రవేశా ద్వారం వరకు దారి ఉంది. దీంతో నిత్యం మందులు మద్యం తీసుకెళ్లి తాగుతున్నారు. అనంతరం బీరు సీసాలను పగుల గొడుతున్నారు. ఖిల్లా గ్రామానికి చివరన ఉండటంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. నిత్యం వందల సంఖ్యలో మందు బాబులు వచ్చి చిందులు వేస్తున్నారు. పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఖిల్లా ప్రాంతంలో ఉన్న మైసమ్మ, శివాలయానికి భక్తులు వెళ్లటానికి జంకుతున్నారు. ఖిల్లాలో పురాతన శివాలయం, మైసమ్మ, అల్లయ్య, కొండయ్యల ఆలయం ఉంది. సోమవారం శివాలయంలో, ఆదివారం మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. మందు బాబుల ఆగడాలు ఎక్కువ కావడంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు.

పేకాట రాయుళ్లకు స్థావరంగా..

ముందు బాబులతో పాటు పేకాట రాయుళ్లు కూడా ఖిల్లాను స్థావరంగా చేసుకున్నారు. దీంతో ఖిల్లా ప్రవేశ ద్వారాల కింద చల్లగా ఉండటంతో ఆ ప్రాంతాన్ని ఎంచుకుని నిత్యం పేకాట ఆడుతున్నారు. అంతే కాకుండ గంజాయి తాగే వారు కూడా అక్కడికే వెళ్లి సేవిస్తున్నారనే అనుమానాలు కూడ ఉన్నాయి. గుట్ట ప్రాంతంగా ఉండటం, మొత్తం పిచ్చి మొక్కలతో ఉండటంతో వారికి అనువుగా ఉంది. అధికారులు చర్యలు తీసుకుని నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

ఆగడాలకు హద్దే లేదు

మందుబాబుల ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. నిత్యం వచ్చి మద్యం సేవిస్తున్నారు. తర్వాత సీసాలను పగుల గొడుతున్నారు. ఆలయాల పవిత్రతను దెబ్బ తీసేలా చర్యలకు పూనుకుంటున్నారు. అధికారులు, పోలీసులు పట్టించుకోవాలి. కఠిన చర్యలు తీసుకోవాలి.

– నర్సింగ్‌రావు, ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు

లబ్ధిదారులు లంచాలు ఇవ్వొద్దు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



అంబం(వై)లో ఇందిరమ్మ ఇంటి భూమి పూజ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, నాయకులు

ఎడపల్లి(బోధన్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎవరూ కూడా లంచాలు ఇవ్వొద్దని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి మండలం నెహ్రూ నగర్, అంబం, ఎడపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... లబ్ధిదారులు కూడా ఎవరికైనా నాయకులకు కానీ, అధికారులకు కానీ లంచాలు ఇచ్చినట్లు తెలిస్తే ఇళ్లను రద్దు చేయడమే కాక క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ఇస్తామన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచించిన మేరకు ఇంటి నిర్మాణ పనులు చేసుకోవాలన్నారు. రాష్ట్ర సహకార సంఘాల సంస్థ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్ల రామ్మోహన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈరెంటి లింగం, నాయకులు బంజగామప్ప, నవీన్, ప్రతాప్ రెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



బోధన్: బండారుపల్లి గ్రామానికి చెందిన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం పట్టణ కేంద్రంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సీపీఎం ఏరియా కార్యదర్శి జంబిశెట్టి, నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్న అర్హులైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. నేతలు ఎండీ వహీద్, శారద, కాడి సాయిలు, మాధవరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి సుందరయ్య



నవీపేటలో సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు



వర్నిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆర్మూర్ పట్టణంలో.. సీపీఎం నేతలు

నవీపేట/వర్ని/ఆర్మూర్‌టౌన్ : కమ్యూనిస్టు యోధుడు, పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జిల్లాలో పలుచోట్ల సోమవారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ.. దేశ ప్రజలే తమ బిడ్డలుగా భావించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని యావదాస్తిని పేద ప్రజలకు పంచిన గొప్ప మహనీయుడు కామ్రేడ్ సుందరయ్య అని కొనియాడారు. పేదల ఆశాజ్యోతి సుందరయ్య అని ప్రశంసించారు. సుందరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జీలుగ విత్తనాలతో భూసారాన్ని పెంచాలి



వేల్పూర్‌లో రైతులకు జీలుగ విత్తనాలు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

వేల్పూర్: జీలుగ విత్తనాలతో రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంపొందించాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ సొసైటీ వద్ద సోమవారం ఆయన రాయితీపై జీలుగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికంగా రసాయన ఎరువులు వాడకుండా జీలుగలాంటి పచ్చిరొట్ట ఎరువులు ప్రతి ఏటా వాడుతూ భూసారాన్ని పెంచాలని కోరారు. అంతేగాక్క రైతులు తమ పొలాల్లో వరికొయ్యలను తగులబెట్టకుండా పొలాలనికి నీరుపెట్టి అందులో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను చల్లుకున్నట్లయితే వరి కొయ్యలు మురిగి ఎరువుగా మారుతుందని చెప్పారు. వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్ నరేందర్, ఏవో శృతి, తదితరులు పాల్గొన్నారు.



బుస్సాపూర్‌లో.. ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి

జీలుగ విత్తనాల పంపిణీ..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో జీలుగ విత్తనాలను సోమవారం వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల శ్రీనివాస్, నూతుపల్లి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



రుద్రూర్: మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రుద్రూర్ ప్రధాన చౌరస్తా వద్ద అవగాహన బైక్ ర్యాలీని సీఐ కృష్ణ కుమార్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో హెల్మెట్ ప్రాముఖ్యత, వాడకం గురించి వివరించారు. ఎస్సై సాయన్న, ఏఎస్సై రాజు, హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, అంజాద్, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, నాయకులు తోట సంగయ్య, ఇందూర్ కార్తీక్, దువ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ వీవోఏపై ఫిర్యాదు



బాధితులతో సమావేశమైన బ్యాంక్ మేనేజర్

ఇందల్వాయి: సిర్నాపల్లి ఇండియన్ బ్యాంక్‌లో వీవోఏగా పని చేస్తున్న గౌరారం గ్రామానికి చెందిన రాముపై మహిళ సంఘాల సభ్యులు బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్‌కి సోమవారం ఫిర్యాదు చేశారు. బ్యాంకులో లోను రావాలంటే తను పనిచేసే ఓ ప్రైవేటు కంపెనీలో బీమా తప్పకుండా తీసుకోవాలనే షరతు పెడుతున్నట్లు మేనేజర్‌కి తెలిపారు. మూడేళ్లుగా ఆయన వ్యవహార శైలి బాగా లేదని గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఆయనను విధుల నుంచి తొలగించాలని బాధితులు డిమాండ్ చేశారు.

ఘనంగా లక్ష్మీనారాయణ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితుడు, భక్తులు



స్వాగతం పలుకుతున్న కందకుర్తి సీతారాం త్యాగి

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలోని కోదండ రామాలయంలో సోమవారం రాత్రి లక్ష్మీ నారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన పండితుడు హరాచారి నారాయణ ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిపారు. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శతచండీ మహాయజ్ఞం ప్రారంభం

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో గల సీతారాం ధాం త్యాగి మహరాజ్ ఆశ్రమంలో శతచండీ మహాయజ్ఞం సోమవారం కనుల పండువగా ప్రారంభమైంది. ఈ నెల 27 వరకు ఆశ్రమంలో పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు చేపట్టారు. అయోధ్య స్వాములకు సీతారాం త్యాగి స్వాగతం పలికారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



సాలంపాడ్ క్యాంప్‌లో భూమి పూజకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు

బోధన్: సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి భూమిపూజ చేశారు. ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఆవుల బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్న రవి, సీనియర్ నేత అల్లె రమేష్, సొసైటీ మాజీ చైర్మన్లు నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు పద్మారెడ్డి, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ పరిధిలో..

వేల్పూర్: జాన్కంపేట్, రామన్నపేట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు సోమవారం ప్రారంభించారు. ఎంపీవో సాయిలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు జి.గంగారెడ్డి, జేమ్స్ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి మౌనిక, శోభన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): కంఠం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండల పార్టీ ప్రెసిడెంట్, బీసీ సెల్ ప్రెసిడెంట్ వెల్మల్ రాజేందర్, చిరంజీవి, గౌతమ్ ,గుండ్ల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



జాన్కంపేట్‌లో..



కంఠం గ్రామంలో..

డాక్టర్‌కు సన్మానం



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలో డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి వైద్య వృత్తి ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలో జగదీశ్వర్‌రెడ్డి వైద్యం ప్రాక్టీస్ మొదలుపెట్టి ఎంతో మందికి సేవ చేశారని ఐఎంఏ సభ్యులు ప్రశంసించారు. ఐఎంఏ సభ్యులు డాక్టర్ రామరాజు, శ్రీనివాస్, పరశురామ్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగు శిక్షణలో ఆదర్శ రైతు



సూచనలు ఇస్తున్న జిల్లా రైతు పాపారావు

డొంకేశ్వర్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో అన్ని జిల్లాల రైతులకు, ఎన్‌జీవోలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తోంది. ఈ నాలుగు రోజుల శిక్షణకు జిల్లా నుంచి ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన సేంద్రియ సాగు చేస్తున్న ఆదర్శ రైతు పాపారావు వెళ్లారు. రసాయనాలు లేకుండా పంటలు పండించే విధానంపై అధికారులు అవగాహన కల్పించగా, తను చేస్తున్న ప్రకృతి సాగుపై పాపారావు కూడా అనుభవాలను శిక్షణలో పంచుకున్నారు. రైతులంతా ఆర్గానిక్ సాగు వైపు మళ్లాల్సిన అవసరం చాలా ఉందన్నారు. రసాయనాలు వాడితే నేలకు నష్టం జరగడంతో పాటు పండించిన ఆహారాన్ని తిన్న మనుషులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో అధికారులు ఇచ్చిన కొత్త సూచనలు, సలహాలను నిజామాబాద్ జిల్లా రైతులకు అందించి ప్రకృతి సాగు చేసే దిశగా కృషి చేస్తానన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3: సింగిల్-11.05, శుభం-1.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-4.30, హిట్-7.00, మిషన్ ఇంపాజిబుల్-10.15

స్క్రీన్-4: మిషన్ ఇంపాజిబుల్-10.00, 4.20, డెవిల్స్ డబుల్ నెక్స్ట్-1.30, సింగిల్-5.05, 7.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-10.35

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

సమాచారం


నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

బోధన్/బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, బోధన్ మండలాల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులకు నేటి నుంచి ఈ నెల 24 వరకు ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు రాజేశ్వర్, జక్కుల రవి, నాగయ్యలు వేర్వేరుగా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి ఇందూర్ బీఈడీ కళాశాలలో, బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నవీపేటకు ఎమ్మెల్యే రాక

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భూమి పూజ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవాన్, శ్రీనివాస్‌గౌడ్‌లు సోమవారం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు హాజరుకావాలని వారు కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ



మెండోరాలో ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి

బాల్కొండ: మెండోరాలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను సోమవారం వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందన్నారు. లబ్ధిదారులు అందరూ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్..

బాల్కొండ మండలం వన్నెల్(బి), మెండోరా మండలం బుస్సాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సోమవారం మార్కింగ్, భూమిపూజ చేశారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎంపీవో మోహన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, తదితరులున్నారు.